# సగటు ఇల్లాలి స్వగతం

**సిం**హాసనంలా వున్న ఎర్రటి మొఖమల్ సోఫాలో సుఖాసీను రాలనయ్యాను. దర్జాగా కూర్చుని వెండి కప్పుతో కాఫీ తాగుతూ మహారాణిలా కూర్చున్నాను. నా పక్క సోఫాలో కూర్చున్నారు మా శ్రీవారు, పిల్లలు.

నాకు పొగడ్తలు గిట్టవు అని ఎన్నిసార్లు చెప్పినా వినరు. నీలాంటి భార్య దొరకడం నా పూర్వజన్మ సుకృతం అంటూ మా ఆయనా, నీవంటి తల్లి కడుపున జన్మించడం మా అదృష్టం అంటూ పిల్లలూ ఒహటే గోల చేసేస్తున్నారు.

అమ్మగారూ! అంటూ వచ్చింది మా పనిమనిషి, కళకళలాడిపోతూ నవ్వుతూ ప్రసన్నంగా వుంది. చిటికెలో పని ముగించింది. ఇక వెళ్ళు అన్నా విన్లేదు – ఇప్పుడే వెళ్ళి ఏంచేస్తాను ఇంకేమైనా పనిచెప్పండి అంటూ కాళ్లవేళ్లా పడితే దయతలచి బియ్యం పప్పులూ బాగు చేయించాను. ఇంకా పని చెప్పు ఇంకా పనిచెప్పు అని ప్రాణం తినేస్తుంటే కసిరి పంపించేశాను.

అంతలోనే వచ్చాడు మా టైలరు. నాకు ఆశ్చర్యం వేసింది. గురువారం నాడు ఇస్తానన్నాడు బట్టలు. ఇవాళింకా మంగళవారమే. ఆ మాటే అడిగాను. వినయంగా నవ్వేడు. ముందు జాగ్రర్తకోసం అలా చెప్తాం. పనయిపోయింది పట్టుకొచ్చేను సరిగా వున్నాయో లేదో చూడండి, అన్నాడు. వేసుకుని చూశాను. బ్రహ్మాండంగా కుదిరాయి. ఆ మాటే చెప్తే ఆనందించి డబ్బు తీసుకుని నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు.

స్నానం ముగించాను. నాకేం చీకా చింతా? పనేంలేదు. అందుకే దర్జాగా కారప్పూస తింటూ టి.వి. ముందు కూర్చున్నాను.

వీపు మీద ఫెడీమని తగిలింది. అదిరిపడి లేచాను. "ఏమిటా మొద్దునిద్ర? బెల్ మోగుతుంటే వినిపించలేదూ" అని విసుక్కున్నారు ఆయన. చెవులు చిల్లులు పడేలా మోగుతోంది కాలింగ్‌బెల్.

నిద్రమత్తు వదిలిపోయింది. ఆదరాబాదరా లేచి వంట్లింట్లోకి పరిగెట్టి గిన్నె తీసుకుని తలుపు తెరిచాను.

ఎదురుగా పాలవాడు ధుమధుమలాడుతున్నాడు.

"ఎంతసేపమ్మా? ఎంతకీ బయటికి రావేం? మీ ఒక్క ఇల్లేనా నాకు? ఆలస్యం అయితే అందరూ నన్ను దుమ్మెత్తి పోస్తారు. ఇంటింటి ముందరా ఇలా పడిగాపులు పడాలంటే నా వల్లకాదు. రేపటినుండి బెల్ ఒకేసారి కొడతాను తలుపుతీస్తే సరే లేదా నా దోవన నేను పోతాను. మళ్ళీ నన్ననకండి!" అన్నాడు. ఏమైనా అంటే పౌరుషం పొడుచుకు వస్తుంది. ఎదురు సమాధానం చెప్తాడు.

ఉసూరు మనిపించిందినాకు. పొద్దున్నే మంగళవాయిద్యం వింటే రోజంతా మంగళ ప్రదంగా గడుస్తుంది అనేది మా అమ్మమ్మ. మంగళవాయిద్యం లేకపోతే పీడాపోయింది. అదేమి ఖర్మమో నిద్రలేస్తూనే చివాట్లతో మొదలవుతుంది నా దినచర్య.

పాలు తీసుకొని వంటింట్లోకి వెళ్ళి నడుం బిగించి రంగంలోకి దిగాను. హాల్లోంచి వంద కుక్కలు వెయ్యి గాడిదలూ ఒకేసారి అరచిన శబ్దం వచ్చింది. పిల్లలు లేచారు. సౌండ్ సిస్టమ్‌లో హై వాల్యూంతో వెస్ట్రన్ మ్యూజిక్ పెడతాడు పుత్రుడు. టి.వి తారాస్థాయిలో పెట్టుకుంటుంది పుత్రిక. ఇద్దర్నీ కసిరి కాస్త సౌండ్ తగ్గించేలా చేసేను.

"పేపరు వచ్చిందా" అంటూ బెడ్‌రూంలోంచి కేక వినిపించింది. వాకిట్లోకి పరిగెట్టాను ఏడుపొచ్చినంత పనయింది. యథాప్రకారం తడినేలమీద పడివుంది న్యూస్ పేపరు.

మా పనిమనిషి తెల్లారగానే వచ్చి వాకిలి కడిగి ముగ్గువేసి వెళ్ళిపోతుంది. అదలా వెళ్ళగానే వస్తాడు పేపరు కుర్రాడు. సైకిల్ దిగకుండానే పేపరు విసిరేసి వెళ్ళిపోతాడు. ఆ పేపరు కాస్తా గాలిపటంలా ఎగురుకుంటూ వచ్చి తడినేలమీద పడుతుంది. అలా విసరకు నాయినా, గోడ మీద పెట్టు అని సవాలక్షసార్లు బతిమాలుకున్నాను. "నాకెలా కుదురుతుంది? ప్రతి ఇంటిముందూ సైకిల్ దిగి స్టాండు వేసి పేపరు పడెయ్యాలంటే బోలెడంత టైమ్‌వేస్ట్. మీకు ఇబ్బందిగా వుంటే నేనొచ్చే టైముకి వాకిట్లో నిలబడితే విసరగానే పట్టుకోండి" అని సమాధానం చెప్తాడు.

తడిపేపరు తీసుకువెళ్ళి ఇస్త్రీ పెట్టె ప్లగ్‌పెట్టి జాగ్రత్తగా ఇస్త్రీ చేశాను. తడిపోయి ఫెళపెళ్లాడింది పేపరు. వరసక్రమంలో మడతపెట్టి తీసుకెళ్ళి ఆయనకి అందించాను.

వంటింట్లోకి వెళ్ళి కాఫీ, టిఫెన్లు తయారుచేశాను. అందర్నీ డైనింగ్ టేబుల్ దగ్గరకి పిల్చాను. ఇడ్లీ, పచ్చడి చూసి మా పిల్లలు మొహాలు మాడ్చుకున్నారు.

అది మా ఇంట్లో అలవాటే. ఇడ్లీ, దోశ, ఉప్మా వగైరాలు చేస్తే పిల్లలకి నచ్చదు. "ఏమిటమ్మా ఈ పురాతనం వంటలు?" అని సణుగుతారు. వాళ్ళకి బ్రెడ్ బటర్, నూడిల్స్, కట్‌లెట్స్ కావాలి.

పోనీ అని చేస్తే ఆయనకి చిరాకు. "ఏమిటో లండన్‌లో పుట్టి పారిస్‌లో పెరిగినట్లు కాంటినెంటల్ బ్రేక్‌ఫాస్టూ నువ్వూను" అంటారు.

అందరికీ ఆనందం కలిగించాలంటే రెండు రకాలు చెయ్యాలి. పోనీ నేను కిందా మీదా పడి చెయ్యాలనుకున్నా బడ్జెట్ అంగీకరించదు . అందుకని వంతులవారీగా అక్షింతలు వేయించుకుంటూ వుంటాను.

టిఫెన్లు ముగించి ఎవరిదోవన వాళ్ళు వెళ్ళారు.

అంతలోనే వచ్చింది మా పనిమనిషి. "ఏమిటమ్మా గిన్నెలింకా బయట వెయ్యలేదు?" అని నిలదీసింది. ఆవిడగారు వచ్చేసరికి గిన్నెలు బయట పడేసి వాటినిండా నీళ్ళు పోసి వుంచాలి. లేకపోతే కడిగిన గిన్నెల్లో నిన్నటి కూర మొన్నటి పచ్చడి భద్రంగా వుంటాయి. ఆదేమంటే "గిన్నెలు ఎండిపోయాయి నేనేం చెయ్యను?" అని ఎదురు ప్రశ్న వేస్తుంది. హడావిడిలో గిన్నెలు బయట వేయడం మరచిపోయాను.

గిన్నెల్లో నీళ్ళు పోసి పెట్టండి. ఈలోగా ఇల్లు చిమ్మి బట్టలు ఉతుకుతాను. చీపురు తీసుకుని హాల్లోకి వెళ్ళింది. పిల్లలు టి.వి. ఆపలేదు. ఏదో సినిమా వస్తోంది.

కురుక్షేత్ర మహాసంగ్రామంలో "అశ్వత్థామ హతః" అనే మాట ధర్మరాజు నోట విని ద్రోణాచార్యుడైనా ఒక్క క్షణం ఆగి అస్త్ర సన్యాసం చేశాడేమోగానీ మా పనిమనిషి ఆ మాత్రం ఆలస్యం కూడా చెయ్యదు. సినిమాగానీ, సినిమా పాటలుగానీ చూసిందో రకామని అస్త్ర సన్యాసం చేసేస్తుంది.

చీపురు అవతలపారేసి టి.వి.ముందు కూర్చుంది. ఉసూరుమనిపించింది నా ప్రాణం.

అసలైనా వేళా పాళా లేకుండా దినం అస్తమానం సినిమాలు వెయ్యాలనే ఆలోచన ఎవరికి వచ్చిందోగానీ వాడిని గుండేసి కాల్చాలి.

గంటసేపు నిరాటంకంగా సినిమా చూసి ఒళ్ళు విరుచుకుంటూ లేచింది. గడియారం చూసి కెవ్వుమంది. "అయ్య బాబోయ్ ఆలస్యం అయిపోయింది, మళ్ళీ

కేరేజీలు తీసికెళ్ళాలి." అంటూ ఆదరాబాదరా రెండు నిమిషాల్లో అంట్లు తోమేసింది. బట్టలు సబ్బులో ముంచి ఈపూటకి మీరు జాడించుకోండి" అంది. ఏమైనా అంటే బట్టల మాట అలా వుంచి నన్ను జాడించేస్తుంది.

ఈసురోమని బట్టలుతికి స్నానం చేసి తయారై తలుపు తాళంపెట్టి, బయలుదేరాను. బోలెడు పనులున్నాయి కరెంటు బిల్లు కట్టి, బ్యాంకుకి వెళ్ళి, కూరలు కొనుక్కుని టైలరు దగ్గరకి వెళ్ళాను.

ఆ టైలరు మా ఏరియాలో బాగా పేరున్నవాడు. షాపు కిటకిటలాడుతూ వుంటుంది. బట్టలు బాగానే కుడతాడుగానీ మీ లెక్కేమిటి అన్నట్లు వుంటాడు. పావుగంట పడిగాపులు పడ్డాక రసీదు తీసుకుని జాకెట్లు వెతికి తీసుకొచ్చాడు. చూడగానే గుండె ఠారుమంది – సీదాసాదాగా కుట్టమని ఇచ్చిన బట్టతో కుచ్చులు పువ్వులూ పెట్టి కుట్టి పడేశాడు. ఒళ్ళు మండిపోయింది. ఏమిటిది అని ఖచ్చితంగా అడిగాను. అలా జరగడానికి వీల్లేదు అంటూ సణుక్కుంటూ ఖాతాపుస్తకం చూశాడు. నెంబరు తారుమారు అయింది. కుట్టుకూలి ఇవ్వద్దులేండి" అన్నాడు ఉదారంగా.

ఒక్క జాకెట్టు బట్టా ఎనభైరూపాయిలు. నిక్షేపంలాంటి రెండు బట్టలు తగలెట్టి, పైగా మాట వరసకి పొరపాటు అయింది అని చెప్పి నన్ను నా ఖర్మానికి వదిలేసి వేరే వాళ్ళతో మాట్లాడుతున్నాడు. ఏం చెయ్యను? ఏమని మాట్లాడను? ఇక ముందు నీకు బట్టలివ్వను అని బెదరించగలను. అంతే నేను చెయ్యగలిగింది.

"మహారాజులా మానెయ్. శతకోటి లింగాలలో నువ్వో బోడి లింగానివి. నువ్వు మానేసినంత మాత్రాన నా వ్యాపారం మూలపడుతుందా?" అంటాడు. నా కడుపులో మండినా అది అక్షరసత్యం.

విదేశాలలో వ్యాపారస్థులు "కష్టమర్ ఈజే గాడ్" అనే సూక్తిని పాటించి గౌరవిస్తారట. దేవుడిలా చూడకపోతేమానె కనీసం సాటి మనిషిగా చూస్తే చాలు. మహాభాగ్యం. ఆ రోజులు ఎప్పుడొస్తాయో.

బయట పనులు చక్కబెట్టుకుని ఇంటికొచ్చేసరికి వాకిట్లో సైకిలు వుంది. ఎవరా అని చూశాను. కార్పెంటరు. భలే సంతోషం వేసింది.

మా సోఫా కొని మూడేళ్ళు అయింది. అదేదో కొత్త ఫేషన్ అని పాతది మార్చి ఇది కొన్నాం. మెత్తగా వుండి కింద కాళ్ళకి బదులు చక్రాలు వున్నాయి.

కొన్న ఆర్నెల్లకే చక్రాలు ఊడిపోవడం మొదలయింది. మేకులు కొట్టి కొన్నాళ్ళు రిపేరు చేశాం అయినా లాభం లేకపోయింది. ప్రస్తుతం మూడు చక్రాలు విరిగిపోయాయి. కలియుగంలో ధర్మదేవతలా ఒంటికాలిమీద నిలబడి వుంది మా సోఫా. మిగిలిన మూడు వైపుల ఇటుకలు పెట్టాం. ఎవరైనా అతిథులు వచ్చి సోఫాలో కూర్చోగానే నా మొహం మాడిపోతుంది. ఆ ఇటుకలు అటూ ఇటూ జరిగి వాళ్ళెక్కడ కిందపడతారో అని భయం. వచ్చిన వాళ్ళకు ఈ కథంతా తెలియదు కదా. కాఫీ నీళ్ళు పొయ్యాల్సి వచ్చి మొహం మాడ్చుకుంది ఈవిడ అనుకుంటారేమో అని మరీ భయం.

ఈ బాధ పడలేక రిపేరు చేయించాలని బడ్జట్ వేసి మా ఆయన చేత డబ్బు శాంక్షను చేయించుకున్నాను. కార్పెంటరుని పిల్చుకొచ్చాను. చక్రాలు పీకి కాళ్ళు పెడతాను అన్నాడు. మూడొందలు అవుతుంది అన్నాడు. బేరం ఆడి రెండొందల యాభైకి ఒప్పించాను. వంద అడ్వాన్స్ తీసుకువెళ్ళాడు.

అదే పోత. మళ్ళీరాలేదు. మండలం రోజులుగా అతడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాను. ఇప్పటికి కనికరించాడు. “పెద్ద పెద్ద ఆర్డర్లు బోలెడున్నాయి. చిన్న పనులు చేసే తీరిక లేదు. అయినా మాట ఇచ్చాను కాబట్టి వచ్చాను. పని మొదలు పెట్టి రెండు గంటల్లో ముగిస్తాను” అన్నాడు. మహద్భాగ్యం అన్నాను. తలనొప్పిగా వుంది కొంచెం టీ ఇవ్వండి అన్నాడు. అలాగే అని వంటింట్లోకి వెళ్ళాను.

టీ కప్పుతో తిరిగి వచ్చేసరికి ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి కళ్ళు తిరిగాయి. ప్రమాదంలో కూలిపోయిన విమానంలా బోర్లాపడుంది సోఫా. హిరణ్యకశిపుడిని చీల్చి చెండాడిన నరసింహావతారంలా నిలబడి వున్నాడు కార్పెంటరు.

“ఏమిటిది? ఎందుకిలా పీకి పెట్టాన్?” అని అడిగాను గట్టిగా. “ఏం చెయ్యను? రిపేరు చేద్దామని చూస్తే వీలైతేనా? లోపలంతా డొల్ల. దీన్ని అమ్మినవాడు దొంగవెధవ. కొన్నవాడు తెలివితక్కువ దద్దమ్మ” అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. సోఫా కొన్నప్పుడు ఆ కొట్టువాడు ‘స్థిరాస్తులతోపాటు ఇదో చరాస్థిగా తరతరాలు అనుభవిస్తారు’ అన్నాడు. ఆ మాటే చెప్తే కార్పెంటరు కడుపుట్టుకుని నవ్వాడు.

“చూస్తూనే వున్నారుగా దీని నాణ్యత. అయినా అమ్మేవాడు లక్ష కబుర్లు చెప్తాడు. కొనేవాడికి వివేకం వుండాలి అంటూ సుత్తి తీసుకుని సోఫామీద బాదాడు. తట్టెడు చెత్తరాలింది. “చూశారా ఎలా పుచ్చిపోయిందో చెక్క” అన్నాడు.

ఏమైనా గట్టిగా మాట్లాడితే స్ప్రింగులూ పీచూకూడా పీకి పెడతాడేమో అని భయం వేసింది. మరి ఇప్పుడేం చెయ్యడం? అని అడిగాను.

టీ తాగుతూ సోఫాని అన్ని కోణాలనుండి పరీక్షగా చూశాడు. ఆ తర్వాత చిన్న సైజు ఉపన్యాసం ఇచ్చాడు. లెక్క ప్రకారం ఆ సోఫాని వెంటనే అవతల పారెయ్యాలని, కాకపోతే తను చాలా గొప్ప పని వాడు కావడం వల్ల దానిని బాగుచేసి మరో నాలుగైదేళ్ళు కాళ్ళ మీద నిలబట్టెగలడనీ దాని కోసం ఓ ఐదొందలు ఖర్చు అవుతుందని సారాంశం.

ఏడుపొక్కటే తక్కువ నాకు. అసలే మా ఇంటి ఫైనాన్సియల్ పొజిషను అంతంత మాత్రం. ఎప్పుడూ లోటులోనే నడుస్తుంది వ్యవహారం. 'మోస్ట్ మిస్ మేనేజ్‌మెంట్ నీది. నీకూ నీ పిల్లలకీ ఎంత ఇచ్చినా చాలదు. ఎదురింటి ఇల్లాలిని చూడు, అంటూ మా ఆయన అక్షింతలు వేస్తూనేవుంటారు.

మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లూ అసలే పీకలదాకా ఖర్చుల్లో మునిగిపోయి నేనేడుస్తుంటే ఇదో అదనపు ఖర్చు. ఏడిచి ఏం ప్రయోజనం? ఎవడొచ్చి ఆదుకుంటాడూ? అందుకే ధైర్యం తెచ్చుకుని ఆలోచించాను.

జటాయువులాగా పడున్న సోఫాని అలా వదిలెయ్యలేను. బాగుచేయించడం అనివార్యం. ఆ చేయించేది ఏదో ఇతని చేతో చేయిస్తే తిప్పట అయినా తగ్గుతుంది. అందుకని సరే అన్నాను. నాలుగొందలు ఇవ్వండి సామాన్లు కొనుక్కురావాలి అన్నాడు.

పచ్చివెలక్కాయగొంతున పడినట్లు అయింది నాకు. డబ్బులిస్తే అదే పోత పోయి నెలదాకా తిరిగి రాడేమో అని భయం. ఇవ్వనంటే ఆ సోఫాని అర్ధంతరంగా వదిలేసి పర్మెనెంట్‌గా పోతాడేమో అని భయం. కాసేపు తర్జన భర్జనపడి దేవుడి మీద భారం వేసి డబ్బులు తెచ్చి ఇచ్చాను. పన్లన్నీ పక్కనపెట్టి నారదుడిలా భగవన్నామ స్మరణ చేసుకుంటూ గుమ్మంలోనే కూర్చున్నాను. నా అదృష్టం బాగుంది. గంటలో వచ్చాడు కార్పెంటరు. పని పూర్తి చేశాడు.

గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాను. నా పరిస్థితికి నామీద నాకే జాలి వేస్తూ వుంటుంది. సగటు ఇల్లాలిగా తెల్లవారి లేస్తే వివిధ వృత్తుల వారితో పని వుంటుంది. అందరికీ నేనే లోకువ. డబ్బులిచ్చుకుంటూ వారి చుట్టూ ప్రదక్షిణలు చెయ్యాలంటే ప్రాణం చివుక్కుమంటుంది. వాళ్ల చిరాకులూ పరాకులూ భరించాలంటే చచ్చేచావుగా వుంటుంది.

అసలీపద్ధతి మారిపోవాలి. మన సమాజంలో ఏదో డిగ్రీ దాకా చదువుకుని పెళ్ళి చేసుకుని ఇల్లాళ్ళుగా గడిపే అమ్మాయిలు కోకొల్లలు. అటువంటి వారికోసం కొత్తరకం విద్యావిధానం ప్రవేశపెట్టాలి.

న్యూటన్స్ లాస్ ఆఫ్ మోషన్, క్వాలిటేటివ్ ఎనాలిసిస్ గృహిణికి ఏం ఉపయోగం. బాటనీ జువాలజీలు ఏం ఉద్ధరిస్తాయి? ఈ చదువులూ ఈ డిగ్రీలూ చదువుకుని ఉద్యోగం చేసుకునేవారికి ఉపయోగిస్తాయి. నాలాటి వారికోసం వేరే రకం సిలబస్ వుండాలి.

ఏదో ఇంగ్లీషు, లెక్కలు, అవసరార్థం నేర్పించి ఆ తర్వాత వంట, కుట్టుపని, కరెంటు పరికరాల రిపేరీ, వడ్రంగం, తగుమాత్రం తాపీపని వగైరా నేర్పించాలి.

వంట వస్తే మామూలు పాస్. కుట్టుపని కూడా బాగా నేర్చుకుంటే సెకండ్‌క్లాస్. వడ్రంగం, కరెంటు పన్లు, పంపులు బాగుచెయ్యడం, తాపీ మేస్త్రీ పని కూడా వస్తే ఫస్టుక్లాసు – వీటన్నింటితోబాటు మగవాళ్ళకి, పిల్లలకి హెయిర్ డ్రెసింగ్ కూడా చెయ్యడం వస్తే డిస్టింక్షన్. ఇలా ఏర్పాటు చేసి డిగ్రీలు ఇస్తే ఉత్తరోత్తరా ఉపయోగంగా వుంటుంది.

'క్షణం తీరికలేదు దమ్మిడీ ఆదాయం లేదు' అన్నట్లు కాలక్షేపం చేసే గృహిణులకు ఎవరి మీదా ఆధారపడకుండా స్వయం శక్తితో బతకగలదు అని తెలిస్తే కాస్త గౌరవం కూడా పెరుగుతుంది.

ఏదో నాడు ఏ మహానుభావుడికో మంచి బుద్ధి పుట్టకపోదు. ముందు ముందు నాలాటి సగటు ఇల్లాళ్ళ జీవితాలు కూడా వెలిగిపోకపోవు.

అందాక తీరిక దొరికినప్పుడల్లా నిద్రపోయి కమ్మని కలలు కనడమే శరణ్యం.

*కాలనిర్ణయ్ కేలండర్ 2000*